తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయానికి రన్నింగ్ వాటర్ సరఫరా చేయలన లక్ష్యంతో అరకు పార్లమెంట్ ఎంపీ నిధులతో సోమవారం స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి, జెడ్పిటిసి దీసరి గంగరాజు, స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, కొత్త భవనం పూర్తయినప్పటికీ రన్నింగ్ వాటర్ లేక పోవడంతో కార్యలయ సిబ్బంది. ఇతర ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. బోరు నిర్మాణంతో నీటి సరఫరా అందుబాటులో వచ్చిందని తెలిపారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ .మదిన, ఇన్స్‌చార్జి ఎంపీడీవో వివి. కుమార్, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రరావు, సర్పంచులు కొర్రా. సింహాద్రి, . సీతయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు పాల్గొన్నారు.

కూనవరం మండలం పొలిపాక వద్ద కోతకు గురైన రోడ్డు

వరద తగ్గినా వీడని కష్టాలు

- తగ్గిన వరద.. కుదుటపడుతున్న పరిస్థితులు
- కొన్నిచోట్ల పునరావాస కేంద్రాల్లోనే బాధితులు
- సహాయక చర్యలపై కలెక్టర్, పిఒ ఆరా
- ముంపు గ్రామాల్లో నిత్యవసరాల పంపిణీ
- సేవా కార్యక్రమాల్లో సిపిఎం నేతలు, కార్యకర్తలు
- పారిశుధ్య పనులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి... చింతూరు. : గోదావరిశబరి నదుల నీటిమట్టాలు క్రమంగా తగ్గుతూ సోమవారం ఉదయానికి రహదారులపై వరద నీరు తగ్గి కొంతమేర రవాణా సౌకర్యం మెరుగుపడింది. చింతూరు మండలం నుండి భద్రాచలానికి వెళ్లే జాతీయ రహదారి 30 పై వరద నీరు తగ్గడంతో రాకపోకలు సాగాయి. చింతూరు వీఆర్‌పురం మండలాలకు సోకులేరు వాగు నీరు ఇంకా పూర్తిస్థాయిలో తగ్గక పోవడంతో రవాణా నిలిచింది. కుయుగూరు. చీకటి వాగు కొంతమేర వరద నీరు తగ్గింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 40 అడుగులకు చేరింది. రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. 8 లక్షల 68 వేల 724 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 45 అడుగులకు చేరి ప్రమాదవ స్థాయి నుండి దిగువకు ప్రవహిస్తోంది. శబరి గోదావరి నదులు శాంతించడంతో ముంపు మండల ప్రజలు భయం గుప్పెట్టి నుండి బయటపడ్డారు.

చింతూరులో పారిశుధ్య పనులు

వరద ఉధృతి తగ్గడంతో మండలంలోని ఏజి కోడేరు. కల్లేరు. చట్టి. చెడుమూరు. మల్లెతోట. ముకునూరు తదితర గ్రామాలలో అధికారులు కూరగాయలు పాల ప్యాకెట్లు. ప్లాస్టిక్ కవర్లు .కొవ్వొత్తులు నిత్యావసరాలు అందజేశారు. చింతూరు మండల కేంద్రంలో వరద తగ్గడంతో రోడ్డుపై మేట వేసిన చెత్తాచెదారాన్ని స్థానిక ఎంపిడిఒ వెంకటరత్నం, కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది జెసిబిల సాయంతో మురుగు వ్యర్థాలను తొలగించినారు. శబరి ఒడ్డు నిర్వాసితులకు మంచినీటి ట్యాంకర్ ద్వారా త్రాగు నీరు అందించారు. ట్రాక్టర్ వాహనదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్వాసితులకు సామాన్లను తరలించేందుకు ఉచిత సర్వీసును అందజేశారు.

ఇంకా పునరావాస కేంద్రాల్లోనే వరద బాధితులు..

కూనవరం :ముంపు మండలాల్లో వరద భయం. ఇంకా వీడలేదు. సోమవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 40అడుగులకు తగ్గింది. మండలంలో 48 గ్రామాలు ముంపు బారిన పడగా, మొత్తం 27 పునరావాస కేంద్రాలలో వరద బాధితులు తలదాచు కుంటున్నారు.కొన్ని గ్రామాల్లో ఎత్తయిన ప్రదేశాల్లో గుడారాలు వేసుకుని, కరెంటు లేక చిమ్మచీకటిలో విషకీటకాలు, దోమలతో కాలం గడుపుతున్నారు. బాధిత గ్రామాల్లో అధికారులు కూరగాయలు సరఫరా చేస్తున్నారు పోలిపాక వద్ద వరద ఉధృతికి రహదారి దెబ్బతింది.

చింతూరులో బాధితులకు తాగునీరు పంపిణీ

వెంకన్నగూడెంలో రోడ్డు అంచున గుడారాల్లో వరద బాధితులు

బాధితుల బ్యాంక్ అకౌంట్లు సేకరించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చింతూరు: చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలలో వరద బాధితుల బ్యాంక్ అకౌంట్‌లను సేకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంకాలం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో చింతూరు మండలానికి సంబంధించిన తహశీల్దార్ కె.సుబ్బారావు, ఎంపిడిఒ వెంకటరత్నం, విఆర్‌ఒ, కార్యదర్శులతో వరద సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ వరదల ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం. కందిపప్పు లీటర్ వంటనూనె సరఫరా చేస్తామన్నారు. ప్రతి వరద బాధిత కుటుంబానికి ఎంతమందికి నిత్యవసర వస్తువులు సరఫరా చేసింది, ఇంకా ఎంత నిలువ ఉన్నవి ఆరా తీశారు. చింతూరు మెయిన్ రోడ్డు ఇరువైపులా పారిశుద్ధ్య కార్యక్రమాలు పక్కగా నిర్వహించాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు

బాధితులతో మాట్లాడుతున్న పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి- చింతూరు: డివిజన్లో ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి నిత్యవసర వస్తువులు సరఫరా చేస్తామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. సోమవారం చింతూరు గ్రామంలో పర్యటించి ముంపు బాధితులకు నిత్యవసర వస్తువులు అందినది లేనిది తెలుసుకున్నారు. కొంతమందికి కూరగాయలుపిఒ స్వయంగా అందజేశారు. అనంతరం విఆర్ పురం గ్రామానికి నాటు పడవలో ప్రయాణించి, అక్కడ బాధితులను పరామర్శించి, అందుతున్న సహాయకచర్యలపై ఆరా తీశారు.చింతూరు.,కూనవరం, విఆర్ పురం, ఎటపాక మండలాల్లోని వరద ముంపు బాధితులకు ముందుగానే రేషన్ సరుకులు చేరవేశామని, బాధితులందరికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తామన్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, గర్భిణులు, బాలింతలు. వృద్ధులు, కొంతమంది అనారోగ్య పీడితులను ఆసుపత్రికి, కొంతమందిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వరద తగ్గుముఖ పట్టిన నేపథ్యంలో పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీల ద్వారా ముమ్మరం చేయాలని ఆదేశించారు.

వరద బాధితుల సేవలో సిపిఎం

వరద బాధిత గ్రామాలకు కూరగాయలతో బోట్లలో వెళుతున్న సిపిఎం నేతలు

విఆర్ పురం : వరద బాధితులను అప్రమత్తం చేయడం, ఆదుకోవడంలో సిపిఎం బృందం ముందువరుసలో ఉంది. పది రోజుల నుంచి రామవరం అడివి వెంకన్న గూడెం, సోముల గూడెం, శబరిరాయిగూడెం, కోప్పల్లి తదితర ముంపు బాధిత గ్రామాలను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ళ కష్టాలు తెలుసుకుంటూ వారికి ఏ అవసరమైన సాయాన్ని అందించడంలో విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, విఆర్ఒ, రామవరం గ్రామపంచాయతీ సెక్రెటరీ తాతారావు ముందుకు సాగారు. వీరితో పాటుగా సిపిఎం యువగళం నాయకులు కారం సుందరయ్య కుకునరు నాగరాజు, పులి మురళి, కారం సందీప్, బొప్పిన రాజు, కారం మల్లేష్, జగన్ లక్ష్మణ్ వార్డు నెంబర్ సుధీర్ రామవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఆసు లక్ష్మయ్య, శబరి రాయిగూడెం గ్రామ శాఖ కార్యదర్శి కుకునరు మురళి, రైతు సంఘం విఆర్ పురం మండల కార్యదర్శి వడ్లది రమేష్, సిపిఎం బృందం రాత్రి వేళల్లోనూ బాధితులకు చేరువలో ఉండి వారిలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే పడవలు కట్టించి ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

శ్రీరామగిరి గ్రామంలో బాధితులకు పాలు, కొవ్వొత్తుల పంపిణీ

విఆర్ పురం: వరద ముంచెత్తడంతో పదిరోజులుగా గుట్టలపైకెక్కి అక్కడే దీనంగా గడుపుతున్న బాధితులకు శ్రీరామగిరి గ్రామంలో పాలు, కొవ్వొత్తులను సర్పంచ్ పులి.సంతోష్ కుమార్ పంపిణీ చేశారు. గ్రామాలను వదిలి తాము తరలిపోతున్నా అధికారులెవరూ తమను పట్టించుకోవడం లేదని, తాత్కాలిక గుడారాలు వేసుకునేందుకు బరకాలుగానీ, ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. అధికారుల సాయం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న బాధితులకు ఆదివారం ఉల్లిపాయలు, దుంపలు, వంకాయలు అందజేసిన సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, సోమవారం పాలు, కొవ్వొత్తులను అందజేశారు. కాపర్ డ్యాం ప్రభావంతో గోదావరిలో వరదనీరు తగ్గినా, విలీన గ్రామాల్లో ముంపు భయం పోవడం లేదని, తాడువాయిలో తమకోసం కట్టించిన ఇళ్లకు అన్ని సౌకర్యాలను కల్పించి అక్కడకు తమను తరలించాలని కోరుతున్నారు. చొక్కానపల్లి. కల్తునూరు. కొత్తూరు. ప్రజలకు బోటు ద్వారా గ్రామాలకు తరలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పూసం రవివర్మ, విఆర్ఒ రమాదేవి, పంచాయితీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

పాలప్యాకెట్లు, కొవ్వొత్తులు ఇస్తున్న సర్పంచ్ సంతోష్‌కుమార్

ముంపు బాధిత గ్రామాల్లో ఎంపిపి లక్ష్మి, సిపిఎం నేతలు

బోట్లలో వరద బాధిత గ్రామాలకు సిపిఎం నేతలు

విఆర్ పురం: మండలంలోని జీడిగుప్ప పంచాయతీలోని జీడిగుప్ప, ములకనపల్లి, కోటార్గు, కొమ్ము గ్రామాలకు బోటులో వెళ్లిన సిపిఎం బృందం బాధితులకు కూరగాయలు తీసుకెళ్లారు బాధితుల సమస్యలు తెలుసుకున్నారు.ఆయా గ్రామాల్లోకి బాధితులకు నిత్యవసర వస్తువులు, ఉల్లిపాయలు దొండకాయ, ఆలుగడ్డ, పాలు ప్యాకెట్ సిపిఎం బృందం పంపిణీ చేసింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూణ్యం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం. చినబాబు మాట్లాడుతూ కొండలపై గుడారాలు వేసుకొని ప్రజలు ఇన్ని కష్టాలు పడుతుంటే, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నార. పదిరోజులుగా నిర్లక్ష్యంగా వదిలేస్తే బాధితుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిర్వాసితులకు కష్టాలను స్వయంగాచూస్తే అధికారులు, నేతల్లో కదలిక వస్తుందేమోనని, అపుడైనా వారికి పునరావాసం, ప్యాకేజీనిచ్చి గ్రామాల నుంచి తరలించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు..కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు.పంకు సత్తిబాబు. కదల కొడయ్యరెడ్డి.వాలా కిష్టారెడ్డి.లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మహిళ అన్నదానం

కూనవరం :వరదలకు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులకు తన వంతు సాయంగా అన్నదానం చేసిందో మహిళ.భీమవరం గ్రామానికి చెందిన వీధుల సునీత వరద బాధితులకు సుమారు 700మందికి అన్నదానం చేసి తన దాతృత్వాన్ని చాటుకుంది. ఈ సమయంలో ఇంతటి సహాయాన్ని చేసిన మహిళను వరద బాధితులు, సామాజిక మధ్యమాల్లో అభినందించారు. కుటుంబసభ్యులతో సహ కార్యక్రమంలో పాల్గొని, బాధితుల కడుపు నింపింది.

వంటల తయారీలో పాల్గొన్న సునీత

పట్టించుకోవడం లేదు...

గోదావరికి వరదవచ్చిన వెంటనే అడవిలోని గుడారాలకు చేరుకున్నాం. పదిరోజులౌతున్నా ఏఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఆదివారం ఉల్లిపాయలు, దుంపలు, వంకాయలు, పాలప్యాకెట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎలా వండుకుని తినాలి. బకరాలు ఇవ్వలేదు. కొందరు సొంతంగా కొనుకున్నా, అనేక మంది ఇబ్బందులతో గడుపుతున్నారు. కరెంటు లేదు. కిరోసిన్ కొవ్వొత్తులు ఇచ్చిన పాపాన పోలేదు. దోమకాటు, విషకీటకాల భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి అవస్థలతో ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మండలానికి వచ్చినా మావైపు కన్నెత్తి చూడలేదు.

కారం ముత్తమ్మ. అడివి వెంకన్నగూడెం, విఆర్‌పురం మండలం

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

7,8 తేదీల్లో విఆర్ఎల రిలే నిరాహార దీక్ష

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారందరికీ వీఆర్వో ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7,8 తేదీల్లో అల్లూరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన దీక్ష చేస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం వీఆర్‌ఏల జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాల పెరగ లేదని, దీంతో, వీఆర్‌ఏలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైసిపి అధికార రాకముందు వీఆర్‌ఏలకు అనేక హామీలు ఇచ్చిందని నేటికీ అమలు చేయలేదని అందుకే ఉద్యమానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కొండబాబు, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై అదుపు ఏదీ?

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:- మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో ఆదివాసులకు రాజ్యాంగంలో కల్పించిన 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచి గిరిజనేతరుల అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలనిఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యానారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇక్కడి గిరిజనేతరులు గతంలో ఆక్రమించుకున్న భూములను వేరే వారికి విక్రయించడంతోపాటు శాశ్వత గృహ నిర్మాణాలు నిర్మించుకుంటున్నారన్నారు. స్థానిక గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకోకుండా చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టిచాకిరీ

- ప్రభుత్వ తీరుపై నాయకుల మండిపాటు - సమస్యలు పరిష్కరించాలని పాడేరు, రంపచోడవరంల్లో ధర్నాలు

ప్రజాశక్తి-పాడేరు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా తక్కువ వేతనాలతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ దుయ్యబట్టారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఐటీడీఏ నుంచి కలెక్టరేట్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులు అతి తక్కువ జీతాలతో పని చేస్తున్నారని, బడిలో పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి పెట్టుబడులు లేక, చేసిన అప్పులు కట్టలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ధరలు ఆకాశాన్ని అంటుతున్నా కార్మికులకు ఇచ్చే జీతం రెండు వేలతో నెల అంతా ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పనికి తగిన వేతనాలు అందక మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు నెలకు 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో బడి పిల్లలకు భోజనం వండి పెట్టేందుకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేసి, ఒక పిల్లవాడికి భోజన నిమిత్తం రోజు కు ఇచ్చే 6 రూపాయల 85 పైసల సొమ్ము చాలలేదని, రోజుకు 20 రూపాయలు చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. సకాలంలో బియ్యం సరఫరా చేయకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తమ ఇంట్లో బియ్యం తీసుకొచ్చి పిల్లలకు వండి పెడుతున్నారని తెలిపారు.

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల దేవ్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం అరకొర వేతనాలు ఇస్తోందని ఇవి కూడా సకాలంలో చెల్లించలేదని విమర్శించారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు బడ్జెట్ పెంచాలని అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేసి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, తమ్మర్ల అప్పలకొండ పడాల్, జిల్లా కమిటీ సభ్యులు ఎల్ సుందర్రావు, మధ్యాహ్న భోజనం కార్మికుల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పసుపులేటి లక్ష్మి, సోమ్ దేవి, కాంతమ్మ, శాంతి కుమారి, పద్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో ఆందోళన చేపడుతున్న నాయకులు, కార్మికులు

పాడేరులో ఆందోళన చేపడుతున్న సిఐటియు నేతలు, మధ్యాహ్న కార్మికులు

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు, మధ్యాహ్న కార్మికులు

రాజవొమ్మంగి: తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు సబ్ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు ఆధ్వర్యంలో రంపచోడవరం యూనియన్ జిల్లా కార్యాలయం నుండి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఆందోళన చేపట్టారు. తమస సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, భోజన కార్మికుల నాయకులు కె.మంగమ్మ, పద్మ, బాపనమ్మ, అన్న పూర్ణ, టి.కుమారి, ఏడుమండలాల భోజన కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పిఒ

సకాలంలో విత్తనాలు అందజేయాలి

శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు: ఖరీఫ్ లో గిరిజన రైతుల అవసరమే మేరకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మినుముల సరస్వతి.. అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడినా గిరిజన రైతులకు గిట్టుబాటు ధరలు అందడంలేదన్నారు. మార్కెఫెడ్ అధికారులు సకాలంలో పసుపును కొనుగోలు చేయాలని సూచించారు. చివరి దశలో నాణ్యమైన పసుపు కొనుగోలు చేస్తామంటున్నారని, అప్పటికే గిరిజన రైతులు దళారులకు పసుపు విక్రయిస్తున్నారని అన్నారు. గిరిజన రైతులకు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతు బజార్లలో ప్రవేశ కార్డులను అందించాలని సూచించారు. రైతులకు సామలు, కొర్ర విత్తనాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు..

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, సీజనల్‌గా చిరుధాన్యాలు, ఉద్యాన వన విత్తనాలు రైతులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో రాయితీపై గిరిజన రైతులకు వ్యవసాయ శాఖ పంపిణీ చేసిన విత్తనాలపై ఆరా తీశారు. 17353 క్వింటాళ్ల వరి విత్తనాలు, 480 కిలోల రాగి విత్తనాలు రాయితీ పంపిణీ చేయడం జరిగిందన్నారు. గిరిజన రైతులకు రైతు బజార్లలో గిరిజన ఉత్పత్తుల విక్రయాలకు రైతు బజారు కార్డులు జారీ చేస్తామన్నారు.

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్ మాట్లాడుతూ, ఈ ఏడాది 4553 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలు 90 శాతం రాయితీపై పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన వన అధికారి ఎస్.అశోక్, ఎపిఎంఐపి పి.డి.ఓ. కె.నాగ సాయి, 11 మండలాల వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జెడిపిటిసి

ఎమ్మెల్యే దృష్టికి అరకు సమస్యలు

ప్రజాశక్తి-హుకుంపేట: అరకు నియోజక వర్గంలోని సమస్యలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి తెలియపరిచి హుకుంపేట జెడ్పిటిసి రేగం మత్స్యలింగం పేర్కొన్నారు. సోమవారం ఉదయం పాడేరు నివాసంలో కలిశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు నియోజకవర్గం లోని పలు సమస్యలు, పార్టీ పరిస్థితిపై చర్చించామన్నారు. పలు సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే జిల్లా స్థాయి అధికారులకు పలు అంశాలపై నివేదిక సమర్పించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వై. సత్తిబాబు, సర్పంచ్ లు పాడి పద్మకుమారి, రమణమ్మ, వెంకట్ పాల్గొన్నారు.

3న మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం నేతల పిలుపు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 3న సంయుక్త ఆదివాసి, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర మన్యం బందును జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ కోరారు. చింతపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సక్తులతో కలిసి రాజకీయ కుట్రలు చేయడం మాని అక్కడి బీరన్ సింగ్ ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. క్రిస్టియన్, ముస్లింలపై దాడి ఆపాలని, రాజ్యాంగంలోని పేర్కొన్న మత సామరస్యాన్ని పాటించి మతోన్మాద చర్యలకు అడ్డుకట్ట వేయాలన్నారుగిరిజనులు నిలువ నీడలు కోల్పోతున్న పరిస్థితుల్లో నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చి గిరిజనులకు అడవికి ఉన్న అవినాభావ సంబంధాలు దెబ్బతీసి గెంటేయాలని చూస్తుందని విమర్శించారు.తక్షణమే నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వకుండా నామమాత్రంగా ఇచ్చి అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని తక్షణమే పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3 కు చట్టబద్ధత చేయాలని గిరిజనులంతా ముక్తకంఠంతో పోరాడుతున్నా ఈ ప్రభుత్వాలు పట్టించుకో లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీ పోస్టులను ఆదివాసీలతో భర్తీ చేయకుండా మైదాన ప్రాంత ఉపాధ్యాయులతో బదిలీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బోయ/ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని మన్యం అట్టుడుకుతుంటే ప్రభుత్వం రాజకీయ కుట్రలకు పన్నాగం పన్నుతూ మరో మణిపూర్ గా మార్చాలని చూస్తుందని, దీన్ని గిరిజనులు ఎవరు క్షమించరని తెలిపారు.మన్యం బంద్‌లో గిరిజన ప్రజాసంఘాలు, మేధావులు, యువకులు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు కొర్ర కార్తీక్, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పాంగి జీవన్ కృష్ణ, క్రిస్టియన్ సంఘ పెద్ద సతీష్, గిరిజన రైతు సంఘం నాయకులు సింహాచలం పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా పూర్వ అధ్యక్షులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ,మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసులపై జరుగుతున్న అకృత్యాలు, సామూహిక అత్యాచారాలు అరికట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు పునరావాస కేంద్రాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఆదివాసుల జాబితాలో బోయ/వాల్మీకిలను చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటిల ప్రయత్నాలు చేస్తూ తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేశారని విమర్శించారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కిలో సర్బన్న; సీతకుంట వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, భాషా వాలంటీర్ల సంఘం నాయకులు చంద్రయ్య, వీరయ్య, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: 3న రాష్ట్ర మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉప అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి తాపుల.క్రిష్ణారావు, అప్పలకొండ పడాల్ కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, మణిపూర్‌లోని ఆదివాసులకు రక్షణ కల్పించారు. బంద్‌లో పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా భాగస్వామ్యం కావాలన్నారు.

చింతూరు : మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, మహిళలను నగ్నంగా ఊరేగించడం వంటి అమానుష ఘటనలను నిరసిస్తూ ఈనెల 3న రాష్ట్రవ్యాప్త మన్యం బంద్

మాట్లాడుతున్న ధనుంజయ్

నిర్వహించనున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ పిలుపునిచ్చారు. చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలు గోదావరి వరద ముంపును దృష్టిలో పెట్టుకుని అక్కడ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు.

సోమవారం చింతూరులో ఆదివాసీ గిరిజన సంఘం ముఖ్యబాధ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, మణిపూర్ ఏజెన్సీలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న కుట్రతో అక్కడ గిరిజన తెగల మధ్య వివాదాలు రేపే క్రమంలో మైతి తెగకు గిరిజన రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించగా, దానికి శాంతియుతంగా నిరసన తెలియజేసే కుకీనాగ ఆదివాసీ తెగలపై దాడులు దౌర్జన్యాలు చేసి భయభ్రాంతులను చేశారన్నారు. విషయం బయటికి పొక్కకుండా అక్కడి బిజెపి ప్రభుత్వం ఇంటర్నెట్ బంద్ చేసి, మూడు నెలలుగా బయట ప్రపంచానికి ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాన్ని బయటికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక్కడ ఆంధ్రాలోనూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బోయ/వాల్మీకి, బొంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో కలపాలని 52జిఒ ద్వారా పార్లమెంట్ ఆమోదింపజేసేందుకు యత్నిస్తోందని విమర్శించారు. ఏజెన్సీ గిరిజనులకు శతశాతం. విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే జిఒ3 పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావశం కల్పించాలని కోరారు. అటు మణిపూర్‌లో అకృత్యాలు, ఇక్కడ రాష్ట్రంలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ చేపట్టే 3న రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పొడియం, లక్ష్మణ్, సవలం నారాయణ, కారం శేషు, పంద్రు, నాగార్జున్, మడకం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ, ఎపిలో అటవీ హక్కుల చట్టం యధావిధిగా అమలు, గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు పంపిణీ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, జిఒ 3 అమలు, తదితర డిమాండ్లతో పరిష్కరించాలని జీవో నెంబర్ 3 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల3న ఆదివాసీ గిరిజన సంఘాలు తలపెట్టిన మన్యంబంద్ జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొండ్ల సూరిబాబు, తదితరులు పిలుపునిచ్చారు. సోమవారం చికిలింత గ్రామంలో ఆదివాసీగిరిజన సంఘం మండల సమావేశం సంఘం మండల నాయకులు పి పాపారావు అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ, మన్యం బంద్‌లో పెద్ద ఎత్తున గిరిజనులు, మన్యప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చింతూరులో మాట్లాడుతున్న నాయకులు

నేరాలు ఘోరాలు

అదుపుతప్పిన లారీ

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డు రెండవ మలుపు సమీపాన సోమవారం లారీ లోయలోకి దూసుకుపోయింది. అరకు నుండి మైదాన ప్రాంతంలో అధిక లోడుతో ఘాట్ రోడ్ దిగుతున్న క్రమంలో లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకు పోయింది.లారీలో ఉన్న డ్రైవర్ క్లీనర్ గాయాలతో బయటపడ్డారు.

కల్వర్టును పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

కల్వర్టు పరిశీలన

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ పెద్దూరు, మాలింగ్ వలస మార్గమధ్యలో బ్రిడ్జి లేదా. తాత్కాలికంగా కల్వర్టు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా పరిషత్ సభ్యులు దీసరి. గంగరాజుకు స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి, సర్పంచ్ సోమ్మేల రూతు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ప్రజాప్రతినిధులు అధికారుల బృందంతో అక్కడకు సందర్శించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు కొట్టుకు పోయిన కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్ మాట్లాడుతూ, ఈ గడ్డ గుండా పాతకోట, మాలింగ్ వలస గ్రామాలకు చెందిన విద్యార్థినిలు మండల పరిషత్ పాఠశాలలో చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తున్నారన్నారు.భారీ వర్షాలకు గెడ్డ ఉప్పొంగి పొంగి ప్రవస్తుందని, దీంతో పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. వంతెన నిర్మిస్తే ఆయా పంచాయతీ గ్రామాల ప్రజలకు రాకపోకలకు వీలుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఇన్స్ చార్జి అధికారి ఏవివి. కుమార్. సర్పంచ్ సింహాద్రి, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ .నాగులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అమ్మఒడి లబ్ధిదారులు, నాయకులు

అమ్మఒడి లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకువేలీ మండలం సుంకరమెట్ట పంచాయతీ పరిధిలో అమ్మఒడి పథకానికి అర్హత కలిగి లబ్ధిదారులకు తల్లుల ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం గ్రామ సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట పంచాయితీ సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో మొత్తం సుమారు 320 మంది అర్హత కలిగిన అమ్మ ఒడి లబ్ధిదారులు ఉన్నారన్నారు. అర్హత ఉన్న 100 మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు తమ అకౌంట్లో డబ్బులు జమ కాలేదన్నారు. అర్హతలు ఉండి కూడా డబ్బులు అకౌంట్‌లలో జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి జగనన్న అమ్మ ఒడి పథకానికి బటన్ నొక్కి నెల రోజులు కావస్తున్నా నేటికీ జమ కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సిహెచ్ గురుమూర్తి, బాబురావు, లబ్ధిదారులు జయలక్ష్మి, అనూష, శారద, దేవి, పూర్ణిమ, చాలిమి లక్ష్మి, స్వాతి, రూప,గుంద్రి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - సీలేరు: విద్యుత్ ఉద్యోగులకు పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లింపు, దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి జెన్‌కో విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు సోమవారం జెన్‌కో ఇఇ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.. అనంతరం ర్యాలీగా వెళ్లి, పోస్టాఫీస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలను అందజేశారు. నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు వై .సత్తిబాబు వై.ధార్రాజు, భవాని శంకర్ మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎడిఇ అప్పలనాయుడు (క్యాంపు) సబ్ ఇంజనీర్లు శ్రీధర్ శ్రీనివాసు జెఎసి నాయకులు శివప్రసాద్, కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సర్వీసుల రద్దు

ప్రజాశక్తి - సీలేరు: మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ఇంటిలిజెన్స్ హెచ్చరికలను దష్టిలో పెట్టుకొని ఏజెన్సీలో పలు ఆర్‌టిసి బస్సు సర్వీసులు రద్దు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్‌టిసి నైట్ సర్వీసులు వారోత్సవాలకు ముందే రద్దు చేయగా తాజా పరిణామాల నేపథ్యంలో పగటిపూట సీలేరు మీదగా నడిచే బస్ సర్వీసులను సోమవారం నుంచి పోలీసుల ఆదేశాల మేరకు ఆర్‌టిసి అధికారులు పగటిపూట బస్ సర్వీసును రద్దు చేశారు విశాఖపట్నం వయా నర్సీపట్నం, సీలేరు మీదుగా భద్రాచలం వరకు పగలు నడిపే బస్సు సర్వీసును వరదలు కారణంగా చింతూరు వరకే ఆదివారం వరకు నడిపేవారు. ప్రస్తుతం మావోయిస్టుల వారోత్సవాలను దష్టిలో పెట్టుకొని చింతూరుకు పగటిపూట నడిచే అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును సోమవారం నుంచి రద్దు చేశారు. . ప్రస్తుతానికి పగటిపూట అనకాపల్లి సీలేరు నర్సీపట్నం సీలేరు పాసింజర్ బస్ సర్వీసులు అదేవిధంగా పాడేరు సీలేరు ఎక్స్ప్రెస్ సర్వీస్ మాత్రమే ఆర్‌టిసి అధికారులు తిప్పుతున్నారు. రాజమండ్రి వయా మోతుగూడెం మీదుగా సీలేరు వరకు బస్ తిప్పుతున్నారు. భద్రాచలం చింతూరు ముంపు కారణంగా విజయవాడ వయా భద్రాచలం సీలేరు వచ్చే బస్ సర్వీసు రద్దు చేశారు. ఇదిలా ఉంటే పాడేరు వయా సీలేరు మీదుగా డొంకరాయ్ వెళ్లే బస్సు సర్వీసును మావోయిస్టుల వారోత్సవాలు ముగిసే వరకు సీలేరులో నిలుపుదల చేసే విధంగా పోలీసులు చర్యలు చేపట్టారు . పాడేరు రాజమండ్రి డిపోలకు చెందిన బస్ సర్వీసులను రాత్రి సమయంలో మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సీలేరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో భద్రపరుస్తున్నారు. మరసటి రోజు తెల్లవారుజామున సీలేరు నుంచి బస్సులు బయలుదేరే విధంగా పోలీసులు పగడ్బందీ చర్యలు చేపట్టారు.

పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పూర్తి అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే నే సోమవారం ఉదయం నుంచి సీలేరు పంచాయతీ పరిధిలో ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా వెళ్లే ప్రతి వాహనాన్ని స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సాయుధ సిఆర్‌పిఎఫ్ బలగాల సమక్షంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మావోయిస్టులకు సంబంధించి మందు పాత్రలు, గ్రినేట్స్ ఇతర పేలుడు సామగ్రి ఏమైనా తరలిస్తున్నారా అనే కోణంలో వాహనాల్లో ఉన్న బ్యాగులు, మూటలు విప్పిమరీ తనిఖీ చేశారు. వాహనాలలో ప్రయాణించే వ్యక్తులు ఆధార్ కార్డులు, ఇతరు వివరాలు సేకరించి అనుమానం లేకుంటే విడిచిపెట్టారు. కొత్త వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి సోదాలు జరుపుతున్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా తారసపడితే తమ సమాచారం అందించాలని కోరారు.

ప్రజల గోడు పట్టేనా !

నేడు విశాఖ నగరానికి రానున్న సిఎం జగన్

స్టీల్‌ప్లాంట్, పంచగ్రామాలు, ఐటి సంగతేంటి ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2019లో వైసిపి రాష్ట్రంలో అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక పలుమార్లు విశాఖ నగరానికి వచ్చి వెళ్లినా కీలకమైన సమస్యలపై మాత్రం ఆయన నోరుమెదిపింది లేదు. ఎన్నికల వాతావరణం అలుముకున్న తరుణాన ఆయన మంగళవారం విశాఖకు వస్తున్న సందర్భంగా ఈసారైనా స్పందిస్తారా ? అన్న చర్చ ప్రస్తుతం జిల్లా అంతటా నడుస్తోంది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విశాఖలో సిఎం అడుగుపెట్టి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ పలు కార్యక్రమాల్లో బిజీగా గడపనున్నారు. గతంలోని ఆయన పర్యటనకూ, నేటికీ ప్రధాన తేడా ఏమిటంటే 2024 ఎన్నికల వాతావరణం ఈసారి కాసింత అలముకుంది. 2019లో విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి తాను చేపట్టబోయే వాటిలో పంచగ్రామాల సమస్య పరిష్కారం, స్టీల్‌ప్లాంట్ సంస్థను రక్షించుకోవడం, ఐటి సంస్థలను విశాఖకు రప్పించుకోవడం వంటివి అనేకం ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఇవే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సవాల్‌గా ఎదురు నిల్చొన్నాయి.

ఈ సమస్యలపై ఎలా స్పందిస్తారు?

సుమారు 900 రోజులుగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, విశాఖ ప్రజానీకం పోరాడుతూ ప్లాంట్ రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. జగన్ తాజా పర్యటనలోనైనా అటువైపు చూస్తారా ? అన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అలాగే పంచ గ్రామాల సమస్యపై ఎందుకు సిఎం చొరవ చేసి పరిష్కరించడం లేదన్న ప్రశ్న ఆ ప్రాంత రైతుల నుంచీ వినిపిస్తోంది. ఈ భూములపై పేద రైతులకు దక్కాల్సిన హక్కుల విషయంలో జగన్ ప్రభుత్వమూ మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఐటి రంగ అభివృద్ధి ఏడాదిలోపే పూర్తిచేస్తానని చెప్పిన వైఎస్ జగన్ కొత్త సంస్థల కోసం చెప్పుకోదగ్గ కృషిచేసిన దాఖలా కానరావడం లేదు. రుషికొండ ఐటి హిల్స్‌పై ఇంకా అనేక సంస్థల కోసం స్పేస్ ఖాళీగానే ఉంది. నడుస్తోన్న ఐటి సంస్థలకు ఇన్సెంటివ్ సమస్య కూడా ఈ ప్రభుత్వంలో పరిష్కారానికి నోచుకోకపోవడంతో కొత్త కంపెనీలు రావడం లేదు. విశాఖలో గతంతో పోల్చితే ట్రాఫిక్ సమస్యలు తీవ్రమయ్యాయి. ఒక్క ఎన్ఎడి ఫ్లై ఓవర్ మినహా చెప్పుకోదగ్గ ఎఫ్‌ఒబిలు లేవు. హనుమంతవాక జంక్షన్‌లో రూ.40 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మించి ఏళ్ల తరబడి ఉన్న రద్దీ సమస్యను నివారిస్తున్నట్లు గతంలో జగన్ హామీ ఇచ్చి వెళ్లారు. ఇది కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

పలు కార్యక్రమాల్లో
నేడు సిఎం బిజీ

మంగళవారం విశాఖలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ముఖ్యమంత్రి హోదాలో జగన్ చేయనున్నారు. ఉదయం 10.45 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టులో అడుగుపెడతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో దిగువ కార్యక్రమాలన్నిటికీ హాజరవుతారు. మధ్యాహ్నం 1.45 గంటల వరకూ విశాఖలో ఉంటారు. కైలాసపురంలో వైజాగ్ పోర్టుకు చెందిన 17 ఎకరాల భూముల్లో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థ రహేజా ఏర్పాటు చేస్తున్న 'ఇనార్బిట్' మాల్‌కు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అలాగే జివిఎంసికి సంబంధించిన సుమారు రూ.138 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఎయులో అభివృద్ధి చేసిన పనులనూ ఆరంభిస్తారు. మొత్తంగా సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులు సిఎం చేతుల మీదుగా మొదలవుతాయి.

8, 9, 10 తేదీల్లో ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం భవిష్యత్తు ఆదివాసీ యువతకు సంస్కృతి సాంప్రదాయాలు వారసత్వంగా అందించడం కోసం ఆదివాసి సాంస్కృతి ఉత్సవాలు (ఆట మాట పాట) కార్యక్రమం ఈనెల 8, 9, 10 తేదీల్లో జిల్లా కేంద్రం పాడేరులో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంఘ నాయకులు తెలిపారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ఈ ఆదివాసి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడేరులో సోమవారం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఆదివాసి సాంస్కృతిక ఉత్సవాల్లో ఆదివాసి వాయిద్యం, ఆదివాసి దింసా, మయూరి దింసా, కొమ్ముకోయ నృత్యం, కర్రల కోలాటం, సంకిడి నాటకం, బుడియానాటకం, బలి పండుగ నాటకం, సంకుపండుగనాటకం, భారీజల నాటకం తదితర ఆదివాసి కళలు ప్రదర్శన ఉంటాయని తెలిపారు.ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ సుందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అధ్యక్షులు, ధర్మన్న పడాల్, ఉపాధ్యక్షులు నరసయ్య, సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నాయపడాల్, జిల్లా నాయకురాలు దాసమ్మ సొన్ దేవి అప్పలకొండ పడాల. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు. జె.వి చలం లక్ష్మణరావు. యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చీకటి నాగేశ్వరరావు. ఆదివాసి సాంస్కృతిక కళామండలి జిల్లా ప్రధాన కార్యదర్శి టి కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చెన్నారావు నరేష్, మాణిక్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకురు పంచాయతీ బలియాగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పనులు జరగకుండానే నాడు నేడు నిధులు స్వాహకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై కఠన చర్యలు తీసుకోవాలని టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిధులను మంజూరు చేయగా పనులు పూర్తిస్థాయి చేపట్ట లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ మేరకు పాఠశాలను పరిశీలించామన్నారు. పాఠశాలలో పనులు పూర్తి చేయకుండా నిధులను ఉపాధ్యాయుడు స్వాహాకు పాల్పడ్డాడన్నారు. పాఠశాల పైకప్పు పూర్తిగా వర్షాలకు కారిపోతుందని, మరుగుదొడ్లు శిథిలావస్థలో ఉన్నాయని, రన్నింగ్ వాటర్ లేదన్నారు. వంట షెడ్డు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇష్టా రాజ్యంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టోకురు పంచాయతీ నాయకులు గెమ్మేల. దేవన్న, పాఠశాల విద్య కమిటీ చైర్మన్ భీమన్న , లక్ష్మణరావు పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి జగదీష్

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -మారేడుమిల్లి : చేతబడి నెపంతో మహిళలను హత్య చేశారన్న ఆరోపణతో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ ఆడహల్ తెలిపారు. సోమవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. మండలంలోని చావడికొట పంచాయతీ బంధ గ్రామానికి చెందిన పల్లాల బున్నమ్మ (53) అనే మహిళను చేతబడి చేస్తుందనే నెపంతో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హత్య చేసి పూడ్చిపెట్టారు. మతురాలు బున్నమ్మ ఇంటిపక్కనే ఉంటున్న సాదల రామిరెడ్డి భార్య అమ్మాయమ్మకు రెండేళ్లగా అనారోగ్యంతో బాధపడుతుండగా, దానికి బున్నమ్మ చేతబడి కారణమని కోపంతో గత నెల 23వ తేదీన రామిరెడ్డి తన అన్నదమ్ముల సహాయంతో బున్నమ్మ మెడకు తాడుతో నులిమి ఉపిరాడకుండా చేసి హత్య చేసి, మృతదేహాన్ని అడవి ప్రాంతంలో గొర్రెలగొప్పు శ్మశానవాటికలో మరి కొందరి సాయంతో పూడ్చిపెట్టారన్నారు.. మతిరాలి కూతురు భద్రమ్మ గత నెల 26వ తేదీన మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది ఎఎస్‌పి పర్యవేక్షణలో సిఐ రమేష్, ఎస్ఐ రాము కేస్ నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులు సాదల రామిరెడ్డి, సాదల నీలంరెడ్డి, సాదల బొర్రంరెడ్డి, వీరికి సహకరించిన బాలురెడ్డి, ధర్మరెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డిలను అరెస్ట్ చేసి రంపచోడవరం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు మూఢనమ్మకాలు పట్ల పోలీస్ శాఖ ద్వారా అవగాహన కల్పించి, మున్ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి అన్నారు.

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- కొయ్యూరు : ఆపరేషన్ పరివర్తనలో భాగంగా మండలంలోని బూదరాళ్ల పంచాయతీలో కునుకూరు, గరిమండ, పిట్టలపాడు, అన్నవరం, బొడ్డు మామిడి, కొర్రపాడు, గొర్లమెట్ట గ్రామాల రైతులకు ప్రత్యామ్నాయ పంటల మొక్కలు జీడి మామిడి, చింత, మామిడి, సిల్వర్ మొక్కలను పంపిణీ చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి సాగును వీడి, ప్రత్యామ్నాయ పంటలు పండించి గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడం కోసం వీటిని అందజేశామన్నారు. ప్రత్యామ్నాయ పంట మొక్కలను ఉపాధి హామీ పథకం, పోలీసుశాఖల ఆధ్వర్యంలో మారుమూల ప్రాంత గ్రామ రైతులక అందించామన్నారు. కార్యక్రమంలో సిఐ స్వామి నాయుడు, కొయ్యూరు ఎస్ఐ రాజారావు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - రాజావొమ్మంగి: దేవీపట్నం మండలం దేవారం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కారం బుల్లిదొర (రాయుడు)ఈ నెల 26న ఆకస్మికంగా మృతి చెందారు. మృతుని కుటుంబసభ్యులకు వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సాయం రూ.పది వేలను దేవారం సర్పంచ్ తుర్రం రమాదేవీ, ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర మృతునికి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుర్రం వెంకన్న దొర,ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, శరభవరం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సిహెచ్.కళ్యాణ్,గ్రామ వాలంటీర్ తెల్లం అనిల్ కుమార్ దొర పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా జయంతి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల పరిషత్ ఇన్‌చార్జి అధికారిగా పి జయంతి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో మారేడుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో జునియర్ అసిస్టెంట్‌గా పనిచేసి సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌పై రాజవొమ్మంగి బదిలీపై వెళ్లిన తిరిగి అక్కడి నుంచి ప్రమోషన్‌పై మారేడుమిల్లి ఎఒగా మారేడుమిల్లి కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒ లేకపోవడంతో ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు.